సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 14 । ఆగస్టు । 2024



చీరల దొంగ అరెస్టు
షాపుల్లో చీరలు దొంగిలిస్తున్న ఓ మహిళను నూజివీడు పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరితో కలిసి 30 చీరలు దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు. 8లో ▸



'మిగులు'పై దిగులు
ప్రైవేట్ ఉద్యోగాలను వదిలిపెట్టి డీఎస్సీకి సన్నద్ధమవుతున్న తరుణంలో మిగులు పోస్టులు ఉన్నాయని ప్రకటించడంతో నిరుద్యోగులు కలవరం చెందుతున్నారు. 8లో ▸



రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి
ఆగి ఉన్న లారీని వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టిన ఘటనలో దేవరపల్లికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. 8లో ▸

వలంటీర్లు కొనసాగేనా?

వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు ఎప్పుడేమన్నారంటే..

వలంటీర్లతో ఎలాంటి లాభం లేదు
వలంటీర్లతో పెద్ద ప్రమాదం వచ్చి పడింది. ఒక అమ్మాయిని తమ వాంఛ తీర్చాలని బలవంతం చేశారు. ఆ అమ్మాయి ఒప్పుకోకపోవడంతో కొట్టారు. ఆమె ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తీసుకువచ్చారు. వలంటీర్లను నియమించాలని ఎవరడిగారు. వారితో ఎలాంటి లాభం లేదు.

– 2020లో చంద్రబాబు

కుటుంబంలో గొడవలు పెడుతున్నారు
ఇంటింటికీ వలంటీర్లు వస్తున్నారు. రాజకీయం చేస్తున్నారు. ఇది ఇస్తాం, అది ఇస్తామని చెప్పి ఇంటిలోపలికి వచ్చి మభ్యపెడుతున్నారు. అలా చేయడానికి వారు ఎవరు, ఎందుకు వివరాలు అడుగుతున్నారు. కుటుంబంలో గొడవలు పెడుతున్నారు.

– 2023లో చంద్రబాబు

వారిలో చాలా సమర్థత ఉంది
వలంటీర్లలో చాలా సమర్థత ఉంది. మేము అధికారంలోకి వస్తే వారిని ఉద్యోగాల నుంచి తీయబోం. వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తాం. వారికిస్తున్న జీతాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతాం. ఆ బాధ్యత నాది.

– ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు

- నేటితో ముగుస్తున్న వలంటీర్ వ్యవస్థ గడువు
- జీతం రూ.10 వేలు చేస్తామని ఎన్నికల ముందు కూటమి హామీ
- అధికారంలోకి వచ్చాక ఆ ఊసెత్తని సర్కారు
- ఐదు నెలలుగా సేవలకు దూరంగా..
- ఉమ్మడి పశ్చిమలో ప్రశ్నార్థకంగా 9,547 మంది వలంటీర్లు భవితవ్యం



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్(ఫైల్)

సాక్షి, భీమవరం: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేసిన వలంటీర్ల భవితవ్యం అగ్యమగోచరంగా తయారైంది. నేటితో వలంటీర్ వ్యవస్థ గడువు ముగుస్తుండగా కూటమి ప్రభుత్వ తీరుతో కొనసాగింపు ప్రశ్నార్థకంగా మారింది. పింఛన్ల పంపిణీని సచివాలయ ఉద్యోగులకు అప్పగించడం ద్వారా ఇప్పటికే సర్కారు వారిని సేవలకు దూరం చేసింది. కులమత వర్గాలు, రాజకీయాలకు అతీతంగా పేదల చెంతకే ప్రభుత్వ పథకాలను చేరవేసేందుకు గత ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తెచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో 50 ఇళ్లకు, పట్టణ ప్రాంతాల్లో 75 నుంచి 100 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున ఉమ్మడి జిల్లాలో 18,867 మందిని నియమించారు. వీరిలో పశ్చిమ గోదావరి జిల్లాలో 8,616 మంది, ఏలూరు జిల్లాలో 10,251 మంది ఉన్నారు. కేవలం రూ. 5 వేల జీతంతో తమ పరిధిలోని కుటుంబాల వారికి ప్రభుత్వ పథకాలను చేరవేయడం, అవసరమైన సర్టిఫికెట్లు మంజూరు చేయించడం, విద్యుత్ బిల్లుల చెల్లింపులు తదితర సేవలందిస్తూ వచ్చారు. కోవిడ్ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు బాసటగా నిలిచారు. ప్రభుత్వం ద్వారా వారికి అవసరమైన మందులు, ఆహారం అందిస్తూ వారు కోలుకునేందుకు కృషిచేశారు.

నేటితో ముగుస్తున్న గడువు
వలంటీర్ వ్యవస్థకు ఆగస్టు 14తో గడువు ముగుస్తోంది. తర్వాత ఈ వ్యవస్థ కొనసాగాలంటే అందుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. వలంటీర్ల విషయమై తన వైఖరి ఏమిటన్నది ఇప్పటివరకు ప్రభుత్వం స్పష్టం చేయలేదు. ఈ పరిస్థితుల్లో కొనసాగింపు కష్టమేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ తీరుతో తమ భవితవ్యం అగమ్యగోచరంగా మారిందని వారు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలుచేస్తూ తమను కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వలంటీర్ల కొనసాగింపుపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఏమీ లేవని అధికారులు అంటున్నారు.

విధుల్లో 9,320 మంది వలంటీర్లు
ఎన్నికల సంఘానికి ఫిర్యాదుల నేపథ్యంలో ఏప్రిల్ గీతదనంతర పరిణామాల్లో ఉమ్మడి జిల్లాలో 9547 మంది రాజీనామాలు చేయగా 9,320 మంది వరకు వలంటీర్లు విధుల్లోనే ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో హామీల అమలు కోసం ఆశతో ఎదురు చూస్తున్న వలంటీర్లకు స్పష్టత ఇవ్వకపోగా పింఛన్ల పంపిణీ నుంచి దూరం చేసి షాకిచ్చింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సచివాలయ ఉద్యోగుల ద్వారానే పింఛన్ల పంపిణీ చేయిస్తోంది. వలంటీర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపే విషయమై ఆలోచిస్తున్నామంటూ పిఠాపురంలో సామాజిక పింఛన్ల పంపిణీ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.

విషం చిమ్మి.. ఆనక కొనసాగిస్తామని హామీ
ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేసిన వలంటీర్ వ్యవస్థపై మొదటి నుంచి టీడీపీ, జనసేన అగ్రనాయకత్వం విషం చిమ్ముతూనే వచ్చింది. గోనె సంచులు మోసే ఉద్యోగాలు, ఇళ్లల్లో మగవాళ్లు లేనప్పుడు తలుపులు కొట్టి కొంపలు కూలుస్తున్నారంటూ వలంటీర్లపై చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేస్తే.. రాష్ట్రంలో మహిళల మిస్సింగ్‌కు వలంటీర్లే కారణమంటూ పవన్ కల్యాణ్ విషం కక్కారు. ఎన్నికలు వచ్చేసరికి వారిని ఆకట్టుకునేందుకు మాటమార్చారు. కూటమి అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామని హామీలు గుప్పించారు. మేనిఫెస్టోలోనూ ఈ అంశాన్ని చేర్చారు.

న్యూస్‌రీల్

ఎస్సీ కాలనీలో పారిశుధ్యం మెరుగు



ఉనికిలి ఎస్సీ కాలనీలో మురుగు నీరు బయటకు పంపిన తర్వాత రోడ్డు

సాక్షి స్పందన

మండవల్లి: మండలంలోని ఉనికిలి ఎస్సీ కాలనీ రహదారులపైకి చేపల చెరువుల నుంచి మురుగు నీరు రావడంపై సాక్షి దినపత్రికలో సోమవారం వార్త వెలువడింది. దీనిపై స్పందించిన కార్యదర్శి మంగళవారం ఉదయం మురుగు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సీఆర్ఆర్ విద్యా సంస్థలకు రూ. కోటి విరాళం



రూ.కోటి విరాళం చెక్కును అందజేస్తున్న అక్కినేని కుటుంబ సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని సీఆర్ రెడ్డి విద్యా సంస్థల కోసం దివంగత సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.కోటి విరాళం అందచేశారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో దివంగత వీరమాచనేని శివరామప్రసాద్ జ్ఞాపకార్థం వీఎస్‌పీ ఫౌండేషన్ తరపున అక్కినేని జ్యోత్స్న, వేములపల్లి సునీత, అక్కినేని ఆదిత్య, వేములపల్లి రోహిత్, మొటపర్తి వెంకట్‌లు సీఆర్ఆర్ విద్యా సంస్థల అధ్యక్షుడు అల్లూరి ఇంద్రకుమార్‌కు రూ.కోటి చెక్కును అందచేసినట్లు సీఆర్ఆర్ విద్యా సంస్థల ప్రతినిధులు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సీఆర్ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్, ఉపాధ్యక్షులు వీవీ బాలకృష్ణారావు, ఏవీ సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి కొడాలి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసం పలు చట్టాలు



న్యాయసేవా భవన్‌లో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): మహిళల రక్షణ కోసం పలు చట్టాలు అమలులో ఉన్నాయని వీటి గురించి తెలుసుకుని అవసరమైనప్పుడు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సాయం పొందవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదన్ భవన్‌లో వితంతు పింఛను పథకంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ అర్హులైన వారు ఈ పథకాన్ని పొందడంలో సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. మహిళల సంరక్షణ కోసం అనేక చట్టాలు ఏర్పాటుచేశారని, సమస్య ఎదురైనప్పుడు వాటిని సరైన మార్గంలో ఉపయోగించి రక్షణ పొందాలన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు 38 మంది ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం విద్యార్థులు 38 మంది పెయిడ్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనట్లు డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ×ప్రీమియర్ ఎనర్జీ ఫొటో వోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి 18 మంది విద్యార్థులు ఆరు నెలల ఇంటర్న్‌షిప్ కోసం ఎంపికయ్యారు. వీరికి ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.15 వేలు స్టైఫండ్‌గా చెల్లిస్తారు. గుంటూరు ఆధారిత బిడ్ అలర్ట్ కంపెనీకి 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి ఇంటర్న్‌షిప్‌లో నెలకు రూ.15 వేల స్టైఫండ్ అందజేస్తారు. ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన విద్యార్థుల పనితీరును బట్టి ఉపాధి అవకాశాలు అందుకుంటారు.

బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రత్యేక చర్యలు



రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి

భీమవరం: రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని, రహదారి భద్రతపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో జంక్షన్లు, జాతీయ రహదారితో స్థానిక రహదారులు కలిసే ప్రదేశాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అలాంటి చోట్ల ప్రమాద నివారణ చర్యలను తీసుకోవాల్సి ఉందన్నారు. విద్యుత్ దీపాలు పెంచాలన్నారు. హెల్మెట్ వాడకం, రహదారి భద్రతా నియమాలు పాటించకపోతే జరిమానా వంటి అంశాలపై పోలీసు, రవాణా శాఖలు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన ప్రణాళిక రూపొందించాలన్నారు. సమావేశంలో అడిషినల్ ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, సెబ్ అడిషినల్ ఎస్పీ రవికుమార్ పాల్గొన్నారు.

డీఈవో విచారణ
ముసునూరు: ముసునూరు లోని బాలికల గురుకుల విద్యాలయంలో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని కొందరు తల్లిదండ్రులు మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో ఫిర్యాదుపై జిల్లా విద్యా శాఖాధికారి విచారణ చేపట్టారు. కలెక్టర్ ఆదేశాలతో డీఈఓ ఎస్.అబ్రహాం మంగళవారం గురుకులానికి విచ్చేసి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తల్లిదండ్రుల కమిటీని వేర్వేరుగా విచారించారు. పాఠశాలలోని పరిస్థితులపై కలెక్టర్‌కు నివేదిక అందించనున్నట్లు ఆయన తెలిపారు.

పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి



కేవీపీఎస్ శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి

భీమవరం: ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. మంగళవారం భీమవరం పట్టణంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహిస్తున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) శిక్షణ తరగతుల్లో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారే క్రమంలో గత ప్రభుత్వం హయాంలో నియమించిన స్కీం వర్కర్లను తొలగించడం అన్యాయమన్నారు. స్కీమ్ వర్కర్లలో అత్యధికులు దళిత, బీసీలేనని గత ప్రభుత్వ విధానాలపై మాట్లాడకుండా కార్మికుల పట్ల కక్ష సాధింపు చేయడం తగదన్నారు. పౌరసరఫరాల శాఖలో జరిగే అవకతవకలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లు ఎత్తివేసేలా ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని కార్పొరేట్లకు అప్పగిస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల్లో క్రిమిలేయర్ వాదన అర్థరహితమని అన్నారు. కార్యక్రమంలో కెవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు, భాగం లక్ష్మి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు బి.రఘురాం, టి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల ఫిర్యాదుకు ప్రత్యేక నంబర్
ఏలూరు(మెట్రో): గిరిజన ప్రాంతాల్లో సమస్యలు తెలియజేసేందుకు 94910 41188 నంబర్‌ను ఏర్పాటు చేశామని ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫోన్ చేసినా లేదా మెసేజ్ పెట్టినా వెంటనే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యం

కలెక్టర్ నాగరాణి

భీమవరం: యువతపై మాదకద్రవ్యాల ప్రభావం పడకుండా వాటి నియంత్రణే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నష ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వాడకం వలన జీవితం నాశనమవుతుందన్నారు. యువతను చెడు మార్గం వైపు నడిపించే వారి సమాచారం తెలియచేయాలన్నారు. రవాణా శాఖ ప్రైవేట్ వాహనాలను తనిఖీ చేసి ఏదైనా సమాచారం ఉంటే పోలీస్ శాఖకు అందచేయాలన్నారు. విద్యాసంస్థల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ మాట్లాడుతూ మాదకద్రవ్యాలతో పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎంపీడీఎస్ యాక్ట్‌లో పేరు **నమోదైతే సమాజంలో ఉనికి కోల్పోతారన్నారు.**

ఉద్యోగ భద్రత కల్పించాలి

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చే నూతన మద్యం పాలసీలో ప్రైవేట్ టెండర్ల ద్వారా కొనసాగించాలని నిర్ణయం తీసుకుంటే మద్యం షాపుల్లో పనిచేసే 12 వేల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదముందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.దివాకర్, ఎ.కృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగభద్రత కల్పించాలని కోరుతూ కలెక్టర్ చదలవాడ నాగరాణికి వినతిపత్రం అందచేశారు. అనంతరం దివాకర్, కృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన మద్యంషాపుల్లో సుమారు 12 వేల మంది పనిచేస్తున్నారన్నారు. నూతన ప్రభుత్వం మద్యం పాలసీలో ప్రైవేటు వ్యాపారులకు అవకాశం కల్పించేలా నిర్ణయం తీసుకుంటే 12 వేల మంది ఉద్యోగాలు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని యూనియన్ సభ్యులంతా ఎమ్మెల్యే, మంత్రులు, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందచేయగా తమ సమస్య పట్ల సానుకూలంగా స్పందిస్తామని హామీ ఇచ్చారన్నారు.



భీమవరం కలెక్టరేట్ వద్ద బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ నాయకులు

ఓటర్ల సర్వే నిర్వహించాలి
భీమవరం (ప్రకాశంచౌక్): సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యదర్శి వివేక్ యాదవ్ తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్‌ఓలతో మంగళవారం ఆయన అమరావతి నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించడానికి ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18 వరకు ఇంటింటా ఓటర్ల సర్వే జరుగుతుందని చెప్పారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలు పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ వీడియో సమావేశంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.

తిరంగా సంబరం

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో హర్ ఘర్ తిరంగా సంబరాలు మంగళవారం అంబరాన్నంటాయి. ఊరూ వాడా తిరంగా యాత్ర నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు జాతీయ జెండాలు చేతబట్టి పురవీధుల్లో ర్యాలీలు చేశారు. విద్యార్థులు భారీ జెండాను పట్టుకుని ఊరేగించారు. పలుచోట్ల మోటార్ బైకల ర్యాలీ నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఏలూరు : భారీ జెండాతో ప్రదర్శనగా స్కౌట్స్ అండ్ గైడ్స్, విద్యార్థులు



ఏలూరు : సంబరంగా తిరంగా యాత్ర



భీమవరం : అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



నరసాపురం రూరల్ : వేములదీవి గొందిమూలలో...



పాలకొల్లు సెంట్రల్ : పట్టణంలో 550 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు



ఆకివీడు : జాతీయ రహదారిపై భారీ త్రివర్ణ పతాకంతో ప్రదర్శన

క్లుప్తంగా

ఆగ్రోవెట్‌లో ఉద్యోగాలకు ఉద్యాన విద్యార్థుల ఎంపిక



ఆగ్రోవెట్ కంపెనీకి ఎంపికైన విద్యార్థులతో ఉద్యాన కళాశాల అధ్యాపకులు

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాలలో విద్యార్థులకు మంగళవారం క్యాంపస్ సెలెక్షన్స్ నిర్వహించారు. గోద్రెజ్ కంపెనీకి చెందిన ఆగ్రోవెట్ ప్రతినిధులు హాజరై 36 మంది విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు జరపగా, వీరిలో 11 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గోద్రెజ్ కంపెనీ ఆగ్రోవెట్ సికింద్రాబాద్ విభాగానికి చెందిన హెచ్‌ఆర్ మేనేజర్ టి.శిరీష, ఫీల్డ్ మార్కెటింగ్ మేనేజర్ వి.మౌనిక, బిజినెస్ లీడ్ ఎం.నాగేశ్వరరావు, టెర్రిటరీ సేల్స్ ఆఫీసర్ జి.అశోక్ ఇంటర్వ్యూలు చేశారు. అసోసియేట్ డీన్ ఎం.మాధవి, ప్లేస్‌మెంటు సెల్ ఇన్‌చార్జి పి.వినయకుమార్ రెడ్డి, డీఎస్‌ఏ సలోమి సునీత పర్యవేక్షించారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

తణుకు: దువ్వ గ్రామంలో ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. పెంటపాడు మండలం అలంపురం గ్రామానికి చెందిన కండెపల్లి సాయి దుర్గారావు అలియాస్ సాయి (24) గత కొన్నేళ్లుగా హైదరాబాదులో ఉంటున్నాడు. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకోవాలనే యోచనలో ఉన్నాడు. ఈ క్రమంలో ఇటీవల హైదరాబాద్ నుంచి దువ్వ గ్రామానికి వచ్చిన సాయి యువతి ఇంట్లోనే ఉంటున్నాడు. అయితే ఇటీవల తాను చేసిన అప్పుల కారణంగా మనస్తాపం చెందిన సాయి సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి వీరన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు తణుకు రూరల్ ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీరలు దొంగిలిస్తున్న మహిళ అరెస్టు

నూజివీడు: షాపుల్లో చీరలను దొంగిలిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసినట్లు నూజివీడు పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్‌మూర్తి మంగళవారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గాంధీనగర్‌లోని ఎస్ఎస్ కలెక్షన్ అండ్ డిజైన్ క్లాత్ షోరూంకు ముగ్గురు మహిళలు ఉదయం 10 గంటల సమయంలో వెళ్లి షాపులో బాయ్‌తో మాట్లాడుతూ 30 చీరలు దొంగలించారు. వారు వెళ్లిన తరువాత గమనించిన షాపు యజమాని పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని మైలవరం రోడ్డులో ట్రిపుల్‌ఐటీ వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక మహిళ చేతిలో బ్యాగ్‌తో యానాదుల కాలనీ వైపుకు వెళుతుండగా పోలీసులకు అనుమానమొచ్చి ప్రశ్నించారు. తనది ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం కొండపల్లికి చెందిన జగన్నాథం జమలమ్మగా మహిళ పేర్కొంది. దీంతో ఆమె బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో 10 చీరలు ఉన్నాయి. దీంతో చీరల విషయమై విచారించగా తనతో పాటు కామేశ్వరి, రాధా అనే వారితో కలిసి నూజివీడులోని షాపులో దొంగతనం చేసినట్లుగా ఒప్పుకుంది. ఆమెను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఈమెపై నూజివీడు టౌన్, మండవల్లి, విజయవాడ, దేవీపట్నం, గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులున్నాయని, మిగిలిన మహిళల కోసం గాలిస్తున్నట్లు సీఐ చెప్పారు.

మిగులుపై దిగులు

అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని ఎన్నికల ముందు ఊదరగొట్టి నిరుద్యోగుల ఓట్లు కొల్లగొట్టిన చంద్రబాబు ప్రభుత్వం తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వారి ఆశలపై నీళ్లు చల్లుతోంది. సీఎం హోదాలో మెగా డీఎస్సీపై సంతకం పెట్టి పోస్టులు భర్తీ చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. దీంతో నమ్మి తాము చేస్తున్న ప్రైవేట్ ఉద్యోగాలను వదిలిపెట్టి డీఎస్సీ పరీక్ష రాసేందుకు సన్నద్ధమవుతున్న తరుణంలో ప్రస్తుత జాబితాల ప్రకారం మిగులు పోస్టులు ఉన్నాయని ప్రకటించడంతో నిరుద్యోగ టీచర్లు కలవరం చెందుతున్నారు. డీఎస్సీలో పోస్టుల భర్తీపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.


గణపవరం ఎంఈవో పి.శేషుకి వినతిపత్రం ఇస్తున్న ఎంటీఎస్ టీచర్స్


ఏలూరు డీఈవో అబ్రహాంకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నేతలు

- టీచర్ల సర్దుబాటులో.. సమస్యలు 'మిగులు'
- ఉమ్మడి జిల్లాలో మిగులు టీచర్ల సంఖ్య 1,346
- వీరిలో 951 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లే
- ప్రత్యేక కేటగిరీ టీచర్లనూ సర్దుబాటు చేస్తున్న వైనం
- కూటమి ప్రభుత్వం తీరుతో గుర్రుగా ఉపాధ్యాయ సంఘాలు
- ఉమ్మడి జిల్లాలో మిగులు టీచర్ల సంఖ్యపై ఆందోళన

నిడమర్రు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో చేపట్టిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు అస్తవ్యస్తంగా ఉందని ఉపాధ్యాయ సంఘాల నేతలు మండిపడుతున్నారు. ఇప్పటి వరకూ ఉపాధ్యాయుల పని సర్దుబాటు ఎస్జీటీ పోస్టులకు మండల స్థాయిలోనూ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు డివిజన్ స్థాయిలో ఎంఈవోలు, డీవైఈవోలు ఆధ్వర్యంలో పూర్తి చేసేవారు. పాఠశాలల్లో గుర్తించిన మిగులు టీచర్లను అవసరమైన పాఠశాలల్లో ఉపాధ్యాయుల అంగీకారం మేరకు ఆయా స్కూళ్లకు తాత్కాలిక ప్రాతిపదికపై సర్దుబాటు చేసేవారు. కానీ నేడు పాఠశాల విద్యాశాఖ చేపట్టిన పని సర్దుబాటు మండల స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను, రాష్ట్ర స్థాయి సమస్యగా మార్చిందంటూ ఉపాధ్యాయ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం జరగాల్సిన ఈ పని సర్దుబాటు తాత్కాలికంగా నిలిపి విడుదల చేసిన టీచర్ల మిగులు జాబితాలో అభ్యంతరాలపై ఈనెల 15 వరకూ వినతులు స్వీకరించనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. అంతేగాని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్న జీవో 53 ప్రకారం పని సర్దుబాటు చేస్తున్నట్లు మాత్రం ఎక్కడ ఉన్నత అధికారులు చెప్పడం లేదు. దీంతో ఈ ప్రక్రియపై ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. దీంతో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాల నేతలతో భౌతిక సమావేశం ఏర్పాటు చేసిన తర్వాతే ఈ పని సర్దుబాటు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. మరో పక్క ఈ పని సర్దుబాటులో గత ఏడాది బదిలీలపై వచ్చిన తమని మినహాయించాలంటూ మినిమం టైమ్ స్కేల్ టీచర్స్ కోరుతున్నారు.

ఉమ్మడి పశ్చిమలో 1,346 మిగులు టీచర్లు

పాఠశాల విద్యాశాఖ ఉమ్మడి పశ్చిమగోదారిజిల్లాలో 1,346 మంది మిగులు టీచర్లు ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. వీరిలో 951 మంది ఎస్జీటీలు, 395 మంది స్కూల్ అసిస్టెంట్‌లు ఉన్నారు. అయితే ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం 295 ఎస్జీటీలు మాత్రమే అవసరమని నిర్ధారించారు. మిగిలిన 656 ఎస్జీటీల పరిస్థితి ఏమిటో తెలియక గందరగోళంగా ఉంది. 337 మంది స్కూల్ అసిస్టెంట్‌లు మిగులు చూపిస్తే 454 మంది ఎస్ఏలు అవసరమని ప్రకటించిన జాబితా స్పష్టం చేస్తోంది. ఇంకా అవసరమైన 117 ఎస్ఏలను పదోన్నతుల ద్వారా పోస్టులు భర్తీ చేస్తే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఫ్యాప్టో నేతలు చెబుతున్నారు. మిగులు టీచర్లను పాత జీవో రద్దు చేసే వరకూ వారి స్థానాల్లోనే కొనసాగించాలని వారు కోరుతున్నారు.

భౌతిక సమావేశం తర్వాతే సర్దుబాటు

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకులు జరుగుతున్న పనిసర్దుబాటును బహిష్కరించారు. ఆగస్టు 9న విద్యాశాఖ నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో సమస్యలను ప్రస్తావించినప్పటికీ వాటిలోని కేడర్ సీనియార్టీ మినహా మిగిలిన డిమాండ్‌లను పరిగణలోకి తీసుకోకుండా పాత జీవోల ప్రకారం సర్దుబాటు చేయడాన్ని వ్యతిరేకించినట్లు ఫ్యాప్టో నేతలు చెబుతున్నారు. 17 ఫ్యాప్టో డిమాండ్‌లను పరిగణలోకి తీసుకుని చర్చించే నిమిత్తం ఉపాధ్యాయ సంఘాలతో భౌతిక సమావేశం నిర్వహించిన తర్వాతనే పనిసర్దుబాటు చేయాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో ఈ మొత్తం ప్రక్రియను బహిష్కరించి ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమవుతున్నట్లు ప్రభుత్వానికి రాతపూరకంగా హెచ్చరికలు చేసినట్లు నేతలు చెబుతున్నారు.

ఫ్యాప్టో డిమాండ్లు ఇవే..

- ప్రభుత్వ జీఓ 117, 128 ప్రకారం కాకుండా 2020లో జారీ చేసిన జీవో 53 ప్రకారం పనిసర్దుబాటు చేయాలి
- పనిసర్దుబాటు ప్రక్రియలో సీనియర్‌కు విల్లింగ్ అవకాశం కల్పించాలి
- సీనియార్టీని లెక్కించినప్పుడు ప్యానల్ నంబర్ లేదా ర్యాంక్‌ను పరిగణనలోకి తీసుకోవాలి
- పని సర్దుబాటు ప్రక్రియ మండల, డివిజన్ స్థాయి వరకే పరిమితం చేయాలి
- పని సర్దుబాటు చేయునప్పుడు ఉపాధ్యాయుని సొంత మేనేజ్‌మెంట్‌లో గల ఖాళీల్లో భర్తీ చేసిన తర్వాతే ఇతర మేనేజ్‌మెంట్లలో నియమించాలి
- 70 శాతంపైబడి అంగవైకల్యం కలిగిన ఉపాధ్యాయులను ఈ సర్దుబాటు నుంచి మినహాయించాలి
- 2025 ఏప్రిల్ 30లోపు పదవీ విరమణ చేసే ఉపాధ్యాయులను వారి పోస్టులను పనిసర్దుబాటు నుంచి మినహాయించాలి. వారి పోస్టు అదనంగా ఉంచాలి
- ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్ పోస్టులను విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కొనసాగించాలి
- 6 నుంచి 10 తరగతులు 10 సెక్షన్లు దాటిన సందర్భంలో 2వ హిందీ, 2వ పీఎస్ పోస్టులను కేటాయించాలి
- ప్రాథమికోన్నత పాఠశాలల్లో జీవో 60 మేరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించాలి
- ఈ సర్దుబాటు ప్రక్రియను మండల స్థాయిలో మాన్యువల్‌గా నిర్వహించాలి
- ప్రాధాన్యత కేటగిరి కింద బదిలీ పొందిన వారికి డివిజన్ స్థాయి సర్దుబాటు నుంచి మినహాయింపునివ్వాలి
- పార్లర్ పాఠశాలల్లో ఉర్దూ, తెలుగు తదితర పోస్టులను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ నుంచి మినహాయించాలి,
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా మాత్రమే పీడీ, పీఈటీలను అదే మండలంలో సర్దుబాటు చేయాలి.
- ప్లస్‌టూ, సీబీఎస్సీ పాఠశాలల్లో పని సర్దుబాటును నిలుపుదల చేయాలి.

సీనియారిటీకి ప్రాధాన్యత ఇవ్వాలి



సర్దుబాటులో ఉపాధ్యాయులు బదిలీ చేయాల్సి వచ్చినపుడు గత విధానంలో మాదిరిగా సీనియర్టీకి ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ సర్దుబాటులో సీనియార్టీని పక్కనపెట్టి పుట్టిన తేదీ ఆధారంగా సీనియార్టీని పరిగణలోకి తీసుకోవడంతో ఉపాధ్యాయుల మధ్య చిచ్చుకు కారణమవుతోంది. ఈ విధానాన్ని తక్షణం విరమించుకోవాలి.

– ఎస్‌కే రంగావలి, పూర్వపు జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీటీఎఫ్

ఏకపక్షంగా సర్దుబాటు చేస్తే బహిష్కరిస్తాం



ఏకపక్షంగా ఉపాధ్యాయుల పనిసర్దుబాటు చేస్తే ఈ నెల 17 తర్వాతైనా బహిష్కరిస్తాం. ఉపాధ్యాయ సంఘాలతో భౌతిక సమావేశం నిర్వహించి అసంబద్ధతలను తొలగించి అమలు చేయాలి. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉన్నత అధికారులకు తెలిపే అవకాశం కల్పిస్తేనే సంఘాల మద్దతు ప్రభుత్వానికి ఉంటుంది.

– పుప్పాల ప్రకాష్‌రావు, రాష్ట్ర కార్యదర్శి, ఎస్టీయూ

ప్రత్యేక కేటగిరీ టీచర్లను మినహాయించాలి



ప్రభుత్వం చేపట్టిన ఈ పనిసర్దుబాటులో ప్రత్యేక కేటగిరి టీచర్లను సర్దుబాటులో బదిలీలు చేయడం దారుణం. 70 శాతం పైబడి వైకల్యం ఉన్న టీచర్లను ఈ సర్దుబాటు నుంచి మినహాయించాలి. గతంలో మాదిరిగా ఈ సర్దుబాటు ప్రక్రియ ఎస్జీటీలకు మండల స్థాయిలో, స్కూల్ అసిస్టెంట్‌లకు డివిజన్ స్థాయిలో పూర్తి చేయాలి.

– డి.జోగినాయుడు, మండల ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

మిగులు జాబితాలతో ఆందోళన



విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయుల పనిసర్దుబాటులో జిల్లాలో 536 ఎస్జీటీ పోస్టులు మిగులు ఉన్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించిన జాబితాల్లో ఉన్న విషయం తెలిసి నిరుద్యోగ టీచర్లు ఆందోళన చెందుతున్నారు. మిగులు పోస్టులు ఉంటే కొత్తగా డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు ఎన్ని భర్తీ చేస్తారో తెలియడంలేదు.

– జి.నాగమణి, డీఎస్సీ అభ్యర్థిని, కైకరం

ప్రైవేట్ ఉద్యోగం వదిలి కోచింగ్‌కు..



మెగా డీఎస్సీ ప్రకటించడంతో ప్రైవేట్ కాన్వెంట్‌లో ఉద్యోగాన్ని వదిలిపెట్టాను. కృష్ణా జిల్లా అవినిగడ్డలో ఓ ప్రైవేట్ కోచింగ్ సెంటర్లో డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్నాను. ప్రస్తుతం జిల్లాలో మిగులు పోస్టుల సంఖ్య భారీగా ఉందని తెలియడంతో భవిష్యత్‌పై నీలినీడలు అలుముకున్నాయి. ప్రకటించిన మేరకే డీఎస్సీలో టీచర్ పోస్టులు భర్తీ చేయాలి.

– కె.కనకదుర్గ, డీఎస్సీ అభ్యర్థిని, కొవ్వలి

ముగ్గురిని బలిగొన్న అతివేగం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- అక్కడికక్కడే ఇద్దరు దుర్మరణం.. చికిత్స పొందుతూ మరొకరి మృతి
- సత్యనారాయణపురం వద్ద హైవేపై ఘటన

దెందులూరు: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందారు. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన దొమ్మేటి నాగార్జున (35), యాగంటి సుబ్రహ్మణ్యం (50), దొమ్మేటి మనోజ్ (21) అన్నదమ్ముల పిల్లలు. వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఇదిలా ఉండగా, విజయవాడలో ఆస్పత్రికి వెళ్లిన వీరు మంగళవారం తిరిగి దేవరపల్లికి కారులో బయలుదేరారు. సత్యనారాయణపురం వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న ఓ లారీని వీరి కారు అతివేగంగా వస్తూ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దొమ్మేటి నాగార్జున, యాగంటి సుబ్రహ్మణ్యం ఘటనా స్థలంలోనే మృతి చెందగా, తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలో ఉన్న దొమ్మేటి మనోజ్‌ను హైవే పోలీసులు అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కారు నంబర్ ఆధారంగా మృతుల వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు ఎస్ఐ కే.స్వామి సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు


కారులో నాగార్జున, సుబ్రహ్మణ్యం మృతదేహాలు


అపస్మారక స్థితిలో ఉన్న దొమ్మేటి మనోజ్

హత్య కేసులో ఇద్దరికి రిమాండ్

ఉండి: ఉండి గోరింతోటలో ఈ నెల 11వ తేదీ రాత్రి జరిగిన యువకుడు నల్లగంగుల నిఖిల్ హత్య కేసులో నిందితులలో ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు మంగళవారం చెప్పారు. ఈ హత్య కేసులో ఐదు గురు నిందితులపై కేసు నమోదు కాగా, వారిలో మొల్లల పవన్‌కుమార్, మారేష్ అనే నిందితులను అరెస్టు చేశామని, మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

దేగాపురంలో ఆటో చోరీ

భీమవరం అర్బన్: దేగాపురంలో ఆటో చోరీకి గురైంది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మర్రి రాజు ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 11 రాత్రి తన ఇంటి వద్ద ఆటో పార్కింగ్ చేసి ఉదయాన్నే చూసేసరికి లేదని ఆటో కోసం ఎంత వెతికినా ప్రయోజనం లేక బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు ఎస్సై జి.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేల్పూరులో చోరీ

తణుకు: వేల్పూరులో తాళం వేసిన ఒక ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారు ఆభరణాలను అపహరించారు. తణుకు రూరల్ ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మార్ని వెంకటరుద్ర శ్రీనివాస్ ఇటీవల ఇంటికి తాళం వేసి వేరే ప్రాంతానికి వెళ్లారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలో దాచుకున్న 5 కాసుల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. వీటి విలువ రూ.1.05 లక్షలు ఉంటుందని వెల్లడించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పగలు రెక్కీ.. రాత్రి బైక్‌ల చోరీ

తాడేపల్లిగూడెం: పగటిపూట రెక్కీ నిర్వహించి ముఠాగా ఏర్పడి మోటారు సైకిళ్లను దొంగిలిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. కాగా ముఠాలో మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. దీనికి సంబంధించి గూడెం డీఎస్పీ మూర్తి మంగళవారం సాయంత్రం విలేకరులకు వివరాలను వెల్లడించారు. పట్టణానికి చెందిన జయప్రకాష్, శశి కుమార్, వర్మ, శ్రీనివాసు, నరసింహమూర్తి అనే వ్యక్తులతో పాటు ఉంగుటూరు మండలం బాదంపూడికి చెందిన గూడెంలో నివాసం ఉంటున్న వెంకటేష్ అనే వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్నారు. ఉదయం ఇళ్ల ముందు నిలిపి ఉన్న మోటారు సైకిళ్లను గమనిస్తూ రెక్కీ నిర్వహిస్తుంటారు. అర్ధరాత్రి పది నుంచి 12 గంటల మధ్య మారు తాళాలతో మోటారు సైకిళ్లను దొంగిలిస్తుంటారు. వీటిని గూడెం మండలం బంగారుగూడెం గ్రామానికి చెందిన మెకానిక్ నరసింహమూర్తికి ఇస్తారు. మెకానిక్ తన వద్దకు వచ్చే కస్టమర్లకు వీటిని తక్కువ ధరకు విక్రయిస్తుంటాడని డీఎస్పీ చెప్పారు. ఈ విధంగా వీరు రూ.9 లక్షల విలువైన 14 మోటారు సైకిళ్లను దొంగిలించారన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న గూడెం డీఎస్పీ మూర్తి, చిత్రంలో సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై రెడ్డి

నిందితుల నుంచి బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల్లో వెంకటేష్ పరారీలో ఉన్నాడన్నారు. జయప్రకాష్‌పై స్నాచింగ్ కేసులు కూడా ఉన్నాయన్నారు. స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లలో పెంటపాడు స్టేషన్‌కు చెందిన మూడు, గణపవరం పోలీసుస్టేషన్‌కు చెందిన మూడు, తణుకు స్టేషన్‌కు చెందిన రెండు, అత్తిలి స్టేషన్‌కు చెందిన రెండు కేసులున్నాయన్నారు. సమావేశంలో పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గూటాలలో భారీ చోరీ

పోలవరం రూరల్: గూటాలలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో భారీ చోరీ జరిగి 90.27 గ్రాముల బంగారపు వస్తువులు, రూ.1లక్ష నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో నివాసం ఉంటున్న మాదిరాజు మాణిక్య కామేశ్వరి సాయిమణి ఈ నెల 1వ తేదీన పింఛన్ తీసుకుని ఇంటికి తాళాలు వేసి కాకినాడలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లింది. సోమవారం ఉదయం ఆ ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని స్థానికులు గమనించి సాయిమణికి సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువా పగులగొట్టి సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉంది. అందులో ఉండాల్సిన 90.27 గ్రాముల బంగారపు ఆభరణాలు, వెండి పట్టీలు, రూ.1 లక్ష నగదు కనిపించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలవరం డీఎస్పీ ఎన్.సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్సై ఎస్ఎస్‌పవన్‌కుమార్, సీఐ జి.మధుబాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీమ్, వేలిముద్రల నిపుణులను రప్పించి ఆధారాలను సేకరిస్తున్నట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వ్యాధుల కాలం... తస్మాత్ జాగ్రత్త

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- నమోదవుతున్న జ్వరం కేసులు
- మోగుతున్న డెంగీ బెల్స్



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

తణుకు అర్బన్: కాలం మారింది ఇక రోగాలతో యుద్ధం చేసేందుకు ప్రజలు సిద్ధం కావాల్సిందిగా ఇప్పటికే సంకేతాలు అందుతున్నాయి. రానురాను వర్షాకాలం అంటే వ్యాధుల కాలంగా ప్రజలు భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాలకారణంగా ఏర్పడే కలుషిత వాతావరణంలో తాగునీరు కలుషితంగా మారడంతోపాటు పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం వంటి కారణాలతో వివిధ రకాల రోగాలు బయటపడే పరిస్థితులకు ప్రజలు బెంబేలెత్తిపోతుండడం తెలిసిందే. దోమలసంచారం తీవ్రతరం కావడంతో ప్రజానీకం భయాందోళనకు గురవుతున్నారు. రోజంతా దోమ కుట్టి కుట్టి చంపేస్తుందంటూ ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో జ్వరాల కేసులు భారీగానే నమోదవుతున్నాయి. ముఖ్యంగా సీజనల్‌గా వచ్చే జ్వరాలతోపాటు డయేరియా, మలేరియా, చికెన్ గున్యా, డెంగీ, స్వైన్‌ఫ్లూ వంటి రోగాలు పొంచి ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే టైఫాయిడ్ జ్వరాల తీవ్రత తీవ్రంగా ఉండగా, డెంగ్యూ వ్యాధి తన ప్రతాపాన్ని చూపించే విధంగా బెల్స్ మోగిస్తోంది. ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గి వివిధ ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీ వ్యాధిగా చికిత్స పొందుతున్న వారి సంఖ్యకూడా గణనీయంగా పెరుగుతోంది.

డయేరియా...
వాంతులు, విరేచనాలు చాలా ప్రమాదంగా మారే అంశం. కలుషితమైన ఆహార పదార్థాలు భుజించడం, ఆహారపదార్థాల అలర్జీ, అతిసార కలరా, షీగెల్లోసిస్, ఎల్లో ఫీవర్ లాంటి జబ్బుల్లో ఈ వాంతులు, విరేచనాలు రెండూ సంభవించవచ్చు.

టైఫాయిడ్..
కలుషిత ఆహారం, నీరు ద్వారా సాల్మోనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపించేది టైఫాయిడ్. విడవకుండా జ్వరం రావడం, 103 నుంచి 104 డిగ్రీల వరకు జ్వరం తీవ్రత. వాంతులు, విరేచనాలు, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం టైఫాయిడ్ లక్షణాలు.

మలేరియా..
ప్లాస్మోడియం జాతి సూక్ష్మక్రిముల మూలంగా ఎనాఫిలస్ దోమ కాటు ద్వారా మలేరియా వ్యాపిస్తుంది. ఈ దోమ కుట్టిన వ్యక్తి రక్తంలోకి ప్రవేశించిన సూక్ష్మక్రిములు కాలేయాన్ని చేరుకుంటాయి. కాలేయ కణాల్లోకి చొచ్చుకెళ్లి సంతానాన్ని వృద్ధి చేసి మలేరియా వ్యాధిని ఉధృతి చేస్తాయి. వస్తూ పోయే జ్వరం, కడుపులో అసౌకర్యం, చలితో వణుకు, కొంతసేపటికి చెమటలు, కొన్ని సందర్భాల్లో మూత్ర పిండాల వైఫల్యం కూడా కనిపిస్తుంది ఇవి మలేరియా లక్షణాలు.

కామెర్లు..
కలుషిత నీరు, కలుషితమైన ఆహారం తీసుకోవడం ద్వారా వచ్చే వ్యాధి కామెర్లు. ఇది హెపటైటీస్–బి, హెపటైటీస్–సి వంటి ఇన్‌ఫెక్షన్‌లతో కామెర్లు రావచ్చు. కళ్లు, చర్మం పసుపు పచ్చగా మారడం, రక్తంలో బిలురుబిన్ స్థాయి పెరగడం, శరీరంలోని సున్నితమైన చర్మం పచ్చబడడం, ఆకలి మందగించడం, జ్వరం, గొంతునొప్పి, మూత్రం పచ్చగా రావడం, మలం తెల్లగా, నల్లగా రంగు మారడం, కడుపునొప్పి, బలహీనత వంటి లక్షణాలు.

చికెన్‌గున్యా...
కీళ్ల నొప్పులతో విజృంభించే చికెన్ గున్యా చాలా ప్రమాదకరంగా మారింది. ఈ వ్యాధి సోకిన వారిని కుట్టిన దోమలు ఆరోగ్యంగా ఉన్నవారిని కుట్టినా సోకే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు.

డెంగీ...
టైగర్ దోమ ద్వారా వ్యాపించే ఈ డెంగీ వ్యాధి మనిషిని ఉన్నపలంగా పడగొట్టే స్థితి కలిగి ఉంది. ఈ దోమ పగటిపూట మాత్రమే కుడుతుంది. ఈ దోమ కుట్టిన 5 నుంచి 8 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయి. ఉధృతమైన జ్వరం, కంటిలో పల నొప్పి కంటి కదలికలను తగ్గించుట వంటివి ప్రధాన లక్షణాలు. నోరు ఎండిపోయి వాంతి కలిగే విధంగా ఉండడం వంటి లక్షణాలు డెంగ్యూ సోకినట్లు గుర్తించి వైద్యుడిని సంప్రదించాలి. ముఖ్యంగా ఈ వ్యాధిలో ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గించే గుణం అధికం. ప్రతి మనిషిలోను 1.5 లక్షల నుంచి 4.5 లక్షల వరకూ వీటి సంఖ్య ఉంటుంది. వీటి సంఖ్య పడిపోతే రక్తస్రావం జరుగుతుంది. చిన్నదెబ్బకు కూడా ఎక్కువ రక్తస్రావం జరిగిన సందర్భాల్లో అశ్రద్ధ చేయకూడదు.

ముందు జాగ్రత్తలు.. నివారణ చర్యలు

ఆహారంపై మూతలు తప్పనిసరిగా ఉంచుకోవాలి. ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. ముఖ్యంగా వాంతులు విరేచనాలు అయ్యేప్పుడు కాఫీ, ఆల్కహాలిక్ డ్రింక్స్, కూల్ డ్రింక్స్, పాలు వంటివి తీసుకోకూడదు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలి. ఖాళీ డబ్బాలు, కొబ్బరిచిప్పలు, ఖాళీ కుండలు వంటివి దోమల ఉత్పత్తి కేంద్రాలు కాబట్టి అటువంటివి లేకుండా చూడాలి. దోమల లార్వాను నశింపచేసే డీజిల్ ఆయిల్, కిరోసిన్ మొదలైన నూనెలను మురుగు కాల్వలపై చల్లాలి. ఫెన్‌థియాన్ అనే కీటక సంహారక మందులను ఇంటి గోడలపై చల్లాలి. వ్యక్తిగత జాగ్రత్తల్లో భాగంగా ఇళ్లలో దోమతెర, కిటికీలకు మెస్ వంటి జాగ్రత్తలు పాటించాలి. ముదురు రంగుల దుస్తులను దోమలు ఆకర్షించే గుణం ఉండడంతో వీలైనంతవరకు లేత రంగు దుస్తులు ఉపయోగించాలి. మలేరియా ప్రబలిన ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే వైద్యుడిని సంప్రదించి యాంటీ మలేరియా మందులు వేసుకోవాలి. ఇలాంటి పరిస్థితులున్న ప్రాంతాలకు గర్భిణులు ప్రయాణాలు మానుకోవాలి.

బకాయి వేతనాలు చెల్లించాలి


నినాదాలు చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఏరియా ఆసుపత్రి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సెక్యూరిటీ, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఇవ్వాల్సిన వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం రెండో రోజు ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. పీఎఫ్ బకాయిలు, ఈపీఎఫ్ సంస్థకు వెంటనే జమ చేయాలని, పెరిగిన పని భారానికి అనుగుణంగా సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరారు. నినాదాలు చేశారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, సురేష్, రాంబాబు, శ్రీనివాస్, వెంకట లక్ష్మి, నాగమణి, మయూరి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన

తణుకు టౌన్: అవయవదానం చేయడం ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ టీ రామబ్రహ్మం చెప్పారు. మంగళవారం తణుకు బ్యాంక్ కాలనీలో గల సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా డాక్టర్ రామబ్రహ్మం మాట్లాడుతూ సమాజంలో అవదానం పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నల్లజర్ల వెంకన్న, కార్యదర్శి ఎండీ స్వాహాలిక, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ


ఎంపీడీవో విశ్వనాథ్‌ను అభినందిస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం ఎంపీడీవోగా విశ్వనాథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కృష్ణా జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు తాడేపల్లిగూడెం ఎంపీడీవోగా పనిచేసిన సుబ్రహ్మణ్య శర్మ కోట నందూరు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో గతంలో ఇక్కడ పని చేసిన విశ్వనాథ్ నియమితులయ్యారు. ఆయనకు మండల పరిషత్ ఏవో సుజాత, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్ భరత్, మండల పరిషత్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

వృద్ధులకు సేవలు అభినందనీయం


వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వృద్ధులకు సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. అభయం లియో లయన్స్ ఆధ్వర్యంలో మంగళవారం పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సేవలో కుందుం వెంకటేశ్వరరావు, డీకేడీ సత్యనారాయణ, కొప్పిశెట్ల సాయి సత్యనారాయణ, కాళ్ళ కార్తీక్, వెజ్జు రవికాంత్, పసుపులేటి జానికరామ్ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టిద్దాం


గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల్లో సేకరించిన చెత్త నుంచి సంపద సృష్టించాలని ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని జగన్నాథపురం చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రంలో సర్పంచ్‌లకు రెండోరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ వెంకటేష్ మాట్లాడుతూ గ్రామంలో చెత్త ఏ విధంగా సేకరించాలి, సేకరించిన చెత్తను ఎలా వేరు చేయాలి, దాని నుంచి ఎలా సంపద సృష్టించవచ్చు అనే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, ఈవో కే.శ్రీనివాస రెడ్డి, సర్పంచ్‌లు, కార్యదర్శులు, రిసోర్స్‌పర్సన్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

మరనాత గార్డెన్‌లో తైలాభిషేక పండుగ


మాట్లాడుతున్న ప్రసంగీకులు పి సంజీవరావు

అత్తిలి: స్థానిక మరనాత గార్డెన్‌లో తైలాభిషేక పండుగను మంగళవారం నిర్వహించారు. మరనాత గార్డెన్స్ అధినేత అద్దంకి జాన్సన్ జాషువా, రాజా జ్యోతి ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ ప్రసంగీకులు పి సంజీవరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జెరూసలేమ్ నుంచి తీసుకువచ్చిన తైలంతో అభిషేక కార్యక్రమాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో పాదర్ ఎం దేవదాసు, బైబిల్ మిషన్ ఉపాధ్యక్షుడు దైవారావు, కార్యదర్శి డి ఇమ్మానియేలు, సంయుక్త కార్యదర్శి ఇమ్మానియేలురాజు, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

విప్లవాత్మకమైన అభివృద్ధి సాధిస్తాం


సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

తాడేపల్లిగూడెం రూరల్: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో విప్లవాత్మకమైన అభివృద్ధి చేసి, చూపిస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని అప్పారావుపేట, మాధవరం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.5.60 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, మాజీ సర్పంచ్ ముత్యాల సత్యనారాయణ, కవులూరి పరిమళ, నాయకులు అడపా ప్రసాద్, పైబోయిన రఘు, అడపా ప్రసాద్ పాల్గొన్నారు.

200 మంది విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ


తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లు పంపిణీ చేసిన డిపో మేనేజరు గిరిధర్‌కుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధులు

తణుకు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లు అందచేసిన రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ అన్నారు. తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో 200 మంది విద్యార్థులకు రోటరీ క్లబ్ సౌజన్యంతో ఉచిత బస్ పాస్‌లు మంగళవారం ఆయన అందచేశారు. రోటరీక్లబ్ అందించిన ఉచిత బస్ పాస్‌లు సమయానికి పాఠశాలకు చేరుకునేందుకు విద్యార్థులకు దోహదపడతాయని స్పష్టం చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఆనందం మస్తాన్‌రావు (బాబి) అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె.సిద్ధార్థ, క్లబ్ ప్రతినిధులు పవన్‌కుమార్ రాజు, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, మేడికొండ వెంకటేశ్వరరావు, బసవ రామకృష్ణ, గమిని రాంబాబు, ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మావతి, ఉపాధ్యాయులు జీజే ప్రభువరం, డిపో ఉద్యోగి ములగాల వెంకటరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


వరిఘేడులో బాల్యవివాహాల చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి

అత్తిలి: పనిచేసే ప్రదేశంలో మహిళలపట్ల లైంగిక వేధింపులకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన శిక్షలు విధిస్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి చెప్పారు. 100 రోజుల మిషన్‌శక్తి కార్యక్రమం కింద బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమాన్ని అత్తిలి మండలం వరిఘేడు పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడు తూ బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యానేరమని, బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించిన వారిపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం శిక్షలు విధిస్తారన్నారు. బాలికలను చదివించడం ద్వారా వారు ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయిని టి సంధ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు కె మీనాకుమారి, సీహెచ్ బేబి, యు సావిత్రి, వై శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర ఫలాలు అందరికీ అందాలి


ఇరగవరంలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ఇరగవరం: మండలంలో హర్ ఘర్ తిరంగా సంబరాలు మంగళవారం అంబరాన్నింటాయి. హర్ ఘర్ తిరంగా అభియాన్ యాత్రలో భాగంగా పీఎం నరేంద్రమోదీ పిలుపు మేరకు జాతీయ జెండాలను పట్టుకుని ర్యాలీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జాతీయతాభావాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో రంగమ్మ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు నాగమణి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు అండగా ఉంటా


ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను సత్కరిస్తున్న తణుకు యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

తణుకు టౌన్: క్రైస్తవులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. మంగళవారం తణుకు యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశానికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఫెలోషిప్ అధ్యక్షుడు పీడీ ప్రసన్న కుమార్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు పాస్టర్ ఎం హారత్‌బాబు దైవ సందేశం అందించారు. ఈకార్యక్రమంలో పాస్టర్‌లకు గుర్తింపు కార్డులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను ఫెలోషిప్ తరపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి ఏలేటి జయబాబు, కే సైమన్ పాల్, ఏసురత్నం, స్పర్జన్ రాజు, వినయ్‌కుమార్, కాకర్ల పండు, షాలేమ్‌రాజు, నిరీక్షణరాజు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మి వ్రతానికి వేళాయె

- మహిళలతో కళకళలాడుతున్న దుకాణాలు
- 16న వరలక్ష్మి వ్రతం


మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న బంగారు రూపులు

తణుకు: మహిళలకు అలంకరణ అంటే ఎంత ఇష్టమో చెప్పనక్కర్లేదు. అందులోనూ సృజనాత్మకతను జోడిస్తూ.. మనసారా వేడుకుంటూ చేసే వరలక్ష్మి వ్రతాల్లో అలంకరణే ప్రత్యేక ఆకర్షణ. కట్టుబొట్టు నుంచి నైవేద్యం వరకూ ప్రతిదీ కొత్తగా ఉండాలనుకుంటారు. అమ్మవారితో పాటు దీపాలు, కలశాలు, ముత్తయిదువులకు ఇచ్చే తాంబూలాలు ప్రత్యేకంగా ఉంటాయి. వీటిని కొనేందుకు మహిళలు చొరవ చూపడంతో మార్కెట్ కళకళలాడుతోంది. మరోవైపు వరలక్ష్మి వ్రతానికి విరివిగా కొనుగోలు చేసే బంగారు రూపులు, బంగారు వస్తువుల విక్రయాలతో మార్కెట్ కళకళలాడుతోంది. తణుకు పట్టణంలోని బంగారు దుకాణాల్లో ప్రత్యేకంగా వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

సంప్రదాయంగా...
సౌభాగ్యం, సంపదలు, కుటుంబ శ్రేయస్సు కోసం మహిళలు ఈ మాసంలో ఆచరించే వాటిలో శ్రీవరలక్ష్మి వ్రతం ప్రధానమైంది. శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున ఈ వ్రతాన్ని చేసుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఈ నెల 16న శుక్రవారం ఈ వ్రతం నిర్వహించనున్నారు. ఇళ్లలో పవిత్ర కలశాన్ని ప్రతిష్ఠించి అమ్మవారి మూర్తిని దానిపై ఉంచి పూజలు చేస్తారు. ఇప్పటి నుంచే వ్రతానికి అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు మహిళలు చొరవ చూపుతున్నారు. దీంతో గత వారం రోజులుగా మార్కెట్లు కళకళలాడుతున్నాయి. వస్త్ర దుకాణాలు, బంగారు ఆభరణాల దుకాణాలు, చిల్లర సరుకులు వంటి అనేక వ్యాపార సముదాయాలు కొనుగోలుదారులతో నిండిపోయి కనిపిస్తున్నాయి. అనేక పెద్ద, చిన్న వస్త్ర వ్యాపారులు శ్రావణమాసం సందర్భంగా భారీ ఆఫర్లు ప్రకటించటంతో మహిళలు కొనుగోలు చేయటానికి రావటంతో కళకళలాడుతున్నాయి.

బంగారం.. కొనుగోలుకు ఆసక్తి...
కలశం వద్ద కొత్తగా కొన్న బంగారు వస్తువులను ఉంచడం ఆనాటి సంప్రదాయంగా వస్తోంది. పండగ నాటికి బంగారం ఖరీదు పెరుగుతుందనే భావనతో మహిళలు ముందే కొద్దో గొప్పో బంగారం కొనుగోలు చేస్తారు. ఈ పండగ కోసమని బంగారు వ్యాపారులు ప్రత్యేకంగా తక్కువధరగల చిన్న వస్తువులను అందుబాటులో ఉంచుతున్నారు. ముఖ్యంగా లక్ష్మీదేవిరూపం కలిగిన బంగారురూపులు, చిన్న డాలర్లు, అమ్మవారి రూపాలను ఒకటి నుంచి రెండు, మూడు గ్రాముల బరువుగల వస్తువులను విక్రయాలకు సిద్ధంచేశారు. వాటితోపాటు వెండితో చేసిన అమ్మవారి ముఖ రూపాలను అందుబాటులో ఉంచారు. కాసులు, బరువును బట్టి రూ. 2000 నుంచి రూ. 7,000 వరకు విక్రయిస్తున్నారు. బంగారు కాసులు, ముక్కు పుడకలు, చిన్న డాలర్లు, చిన్న కమ్మలకు గిరాకీ ఉందని జ్యువెలరీ దుకాణాల యజమానులు చెబుతున్నారు. ప్రత్యేకించి వరలక్ష్మి వ్రతంకోసం మహిళలు చిన్న వస్తువులైనా కొంటారని తెలిపారు. దీనికి తోడు గత రెండు, మూడు సంవత్సరాలతోపోలిస్తే ఈ శ్రావణ మాసంలో వివాహ ముహూర్తాలు ఎక్కువగా ఉండడంతో వ్యాపారం జోరందుకుందని వ్యాపారులు చెబుతున్నారు.

పల్లె ప్రగతికి సమైక్య కృషి

తణుకు టౌన్: పల్లె ప్రగతికి ప్రజాప్రతినిధులు సమైక్యంగా కృషి చేయాలని ఈవోపీఆర్డీ ఏఎస్ కోటేశ్వరరావు తెలిపారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులకు శిక్షణ కార్యక్రమాలు రెండోరోజు కొనసాగాయి. తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో ఉన్న వ్యర్థ పదార్థాల నిర్వహణ షెడ్‌ను మంగళవారం మండల ఈవోపీఆర్డీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించుకొని గ్రామాలను అభివృద్ధి బాట పట్టించాలన్నారు. ఈకార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కార్యదర్శులు పాల్గొన్నప్పటికీ గ్రామ సర్పంచులు మాత్రం ఒక్కరూ కూడా హాజరు కాలేదు. క్షేత్ర పరిశీలన జరిగిన మండపాక గ్రామ సర్పంచ్ తరపున ఆమె భర్త పాల్గొని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలి


నాయి బ్రాహ్మణ సేవా సంఘం సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): నాయి బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్ములూరి శ్రీహరిరావు తెలిపారు. పట్టణంలో మంగళవారం సేవా సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి కొడవర్తి శివ ప్రసాద్ మాట్లాడుతూ సంఘానికి కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు స్థలం, భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలో భాగంగా 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. విశ్వకర్మ యోజన పథకం కింద బ్యూటిషన్ కోర్సులు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ద్వారా కిట్లు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారు ఉప్పలపు పెద్దిరాజు, పోలవరపు పోతురాజు, పట్నాల శంకరం, ప్రచార కార్యదర్శి పసుమర్తి శ్రీనివాస్, తగరపువలస మురళీకృష్ణ, బండారు పెద్దిరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

తణుకు: మండలంలోని దువ్వ గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. మంగళవారం తెల్లవారుజామున గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో రూరల్ ఎస్‌ఐ ఏజీఎస్ మూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి అయిదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ. 8,710 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దూరవిద్య కోర్సులు వినియోగించుకోవాలి

నరసాపురం: దూరవిద్య కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ డి.పుష్పరాజ్యం సూచించారు. మంగళవారం పట్టణంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు దూరవిద్య కోర్సులపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పరాజ్యం మాట్లాడుతూ దూరవిద్య ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్స్ ఆహ్వానిస్తున్నారని చెప్పారు. 14 ఏళ్లు నిండిన వారు దూరవిద్య ద్వారా పదో తరగతి పూర్తి చేయొచ్చని చెప్పారు. అలాగే ఇంటర్మీడియట్ పూర్తి చేయాలనుకునేవారు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని వివరించారు. ఎంఈఓ–2 జాన్‌ప్రభాకర్ మాట్లాడుతూ అడ్మిషన్స్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31 వరకూ గడువు ఉందన్నారు. చిరువ్యాపారాలు చేసుకునేవారు, ముఖ్యంగా మహిళలు ఈ అవకాశం వినియోగించుకుని పదో తరగతి ఉత్తీర్ణత సాధించవచ్చని చెప్పారు.

ఆకతాయిలపై ఖాకీ కన్ను

భీమవరం: విద్యాసంస్థలవద్ద ఆకతాయిల వికృతచేష్టలను అరికట్టడానికి ప్రత్యేకంగా పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు భీమవరం టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ చెప్పారు. టూటౌన్ పరిధిలో ప్రధానమైన విద్యాసంస్థలున్నందున కళాశాల వద్ద ఆకతాయిలు గుమికూడి విద్యార్థులు, ఇతరులను వేధించకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమ పోలీసు సిబ్బంది సివిల్ దుస్తుల్లో ఉదయం, సాయంత్రం సమయాల్లో గస్తీ నిర్వహిస్తారన్నారు. వరుసగా రెండు, మూడు రోజులు పాటు కళాశాలకు సంబంధం లేని వ్యక్తులుంటే వారిని గుర్తించి వారికి ముందుగా కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. కళాశాలలకు దగ్గరలో పార్కింగ్ చేసే వాహనాలు, వ్యక్తుల ఫొటోలు తీసి వారి వివరాలు సేకరిస్తామన్నారు. ఆకతాయిల తల్లిదండ్రులను పిలిపించి హెచ్చరిస్తామని దారికి రాకుంటే కఠిన చర్యలు తప్పవని కాళీచరణ్ హెచ్చరించారు.

టోల్ బాదుడు విరమించుకోవాలి

వీరవాసరం: తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రోడ్ల అభివృద్ధి పేరుతో ప్రజలపై టోల్ టాక్స్ విధిస్తామని కలెక్టర్ల సమావేశంలో ప్రకటించడాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకుడు జత్తిగ నరసింహ మూర్తి విజ్ఞప్తి చేశారు. వీరవాసరం తూర్పు చెరువు సెంటర్లో మంగళవారం నిరసన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వాన్ని మంచి మెజారిటీతో గెలిపించిన ప్రజలపై రోడ్ల ప్రవేటు భాగస్వామ్యం పేరుతో టోల్ ట్యాక్స్ విధించవద్దని కోరారు. ఇప్పటికే పన్నుల భారం పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం టోల్ బాదుడు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లింగం సత్యనారాయణ పాల్గొన్నారు.